

# ఉగాది నాటికల పోటీలో రూ. 3,000 ల బహుమతి పొందిన పౌరాణిక నాటిక

## ఈ నాటికలోని పాత్రలు

మంథర: ముసలిది. చేతిలో పూతకర్ర. కైకకు అరణపు దాసి. కైక గృహంలో చనువు, స్వాతంత్ర్యం ఉన్న స్త్రీ.

చెలికత్తె: సాధారణమైన పరిచారిక.

కైక: కోడెత్రాచు వంటి స్వభావం, మహారాణికి ఉండవలసిన దర్పం అన్ని హంగులా ఉన్న స్త్రీ.

దశరథుడు: తల నెరిసిన వృద్ధ మహారాజు.

సుమంత్రుడు: దశరథుడి అంతరంగికుడు. వయసు మీరిన వాడు. అంతటికీ బుద్ధి చెప్పగలిగిన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు కలవాడు. మంత్రికి తగిన వేషధారణ.

రాముడు: శ్రీరాముడు రాకుమారుడు.

సీత: ముగ్ధ. లావణ్యవతి.

## రంగస్థలానికి అవసరమైన సామగ్రి

రంగము కైక గృహము కాబట్టి మహారాణికి ఉచితమైన పద్ధతిలో అలంకరణ ఉండాలి. ఆకర్షణీయమైన ఒక తల్పము, అవసరమైనప్పుడు మహారాజు కూర్చుండడానికి ఒక పీఠాసనము ఉండాలి. దీపాలు పాత పద్ధతిలో వెలిగేటట్లు అమర్చుకోవాలి. పట్టు పరదాలు చుట్టూ ఉండాలి. నారచీరల మూట మంథర లోపలికి తీసుకురావాలి. రాణి, రాజులకు విసరడానికి వింజామరలు కావాలి.

## రంగస్థలం డిజైను

కైకేయి పడుకునే తల్పం రంగస్థలంలో ఎడం వైపు వెనుభాగంలో ఉండేటట్లు అమర్చితే పాత్రధారుల కదలికకు అనుకూలంగా ఉంటుంది. సింహాసనం మధ్యగా వెనుక వైపు ఉంటే చాలు.

## నేపథ్యంలో

(అయోధ్యా నగరానికి రాజు దశరథుడు. ఆ మహారాజు ఒక రోజున తన వార్ధక్యాన్ని గుర్తించి, తనకు కాలం సమీపిస్తోందని భావించి, రాజ్యానికి వారసుడైన శ్రీరామచంద్రుణ్ణి యువరాజుగా అభిషేకించి తను విశ్రాంతి తీసుకోవాలని నిశ్చయించాడు. ఆలోచన వచ్చిందే తడవుగా మంత్రుల్ని రప్పించాడు. విషయం చర్చించాడు. సామంతరాజులందరికీ వర్తమానం పంపించాడు. అందరూ రాముడు తమకు రాజు కావడం తమ మహాభాగ్యమేనని ప్రశంసించారు. దూరం అధికం కావడం వల్ల జనక మహారాజుకు, కేకయ రాజ్యానికి ఈ వార్త అందలేదు. ఆ సమయంలో భరతుడు కేకయ రాజ్యంలో అతిథిగా ఉన్నాడు.

మంత్రి, సామంతులతో బాటు సర్వ జన సమ్మతమయిన రామపట్టాభిషేకానికి ఏర్పాట్లు మొదలయ్యాయి.

రాజ్యం జ్యేష్ఠక్రమానుగతం అన్న సత్యం గుర్తున్నా—ఒకటిగా పుట్టి, ఒకటిగా పెరిగిన తమ్ముళ్ళను వదిలి పెట్టి తనొక్కడే రాజ్యాభిషిక్తుడు కావడం



# వియోగ విభావరి

నాయుని కృష్ణమూర్తి

రాముడికి బాధాకరమయింది. కాని, తండ్రి ఆజ్ఞ శిరోధార్యమని సమ్మతించాడు.

ఆ నాడు అయోధ్యలో అందరికీ చీకటి ఉండగానే తెల్లవారింది. ప్రతి ముంగిట ముందూ ముత్యాలముగ్గులు మెరిసిపోయాయి. నగరమంతా ప్రజలు ఆనందమనే తరంగాల సవ్వడితో సముద్రంలా కనిపించసాగింది.

దొంగలకు పండు వెన్నెల రేయి పనికి రానట్లు, దేవతలు శ్రీరామ పట్టాభిషేకాన్ని సహించలేకపోయారు. విఘ్నం కల్పించమని శారదాదేవిని వేడుకున్నారు.

శారద మంథర అనే కైకేయి చెలికత్తె బుద్ధిని వ్యాక్షేప చేసింది. కైకేయి రాముడికి సవతి తల్లి. మంథర ఆ కైకేయికి ఆరణపు దాసి. )

( స్థలం: కైకేయి శయన మందిరం. రంగస్థలానికి ఎడమ వేపు హంసతూలికా తల్పం మీద కైకేయి విశ్రమించి ఉంటుంది. ఆమెకు సపర్యలు చేస్తూ ఒక చెలికత్తె. నేపథ్యంలో మహారాణిని జోకొడుతున్నట్లు మధురమైన ఒక వాద్య ధ్వని మంద్రంగా వినిపిస్తుంటుంది. )

మంథర: ( కుడివేపు ద్వారం గుండా శోకాలు పెడుతూ లోనికి ప్రవేశించి



# నాయుని కృష్ణమూర్తి

## జీవిత విశేషాలు

పుట్టినతేది: 12—11—1951. చదువు: ఎం. ఏ. పెళ్ళి: అయి, ఏడేళ్ళు దాటింది. భార్య పద్మకుమారి. ఇద్దరు పిల్లలు—గురుశ్రీధర్, నందకిషోర్. వ్యాపకం: 'మాబడి', 'పారిజాతం' అనే విద్యా సాంస్కృతిక మాసపత్రికలకు సంపాదకత్వం. ఇతర రచనలు: ప్రాచీన కావ్యాలకు, పురాణాలకు వ్యావహారిక రూపం కల్పించడం ధ్యేయంగా ఇదివరకు రామాయణం, మహాభాగవతం, మహాభారతం (ఇందులో ఒక్క భాగం మాత్రమే ఇంతవరకు ముద్రించబడింది) లను వ్రాయడం జరిగింది. సాంఘిక నవలలు: కేం, కాటుక కరిగిపోయింది (ఈ రెండూ ఎమెస్కో పాకెట్ బుక్ సీరీస్‌లో వచ్చాయి). గాలిపెంకు (జ్యోతి మాసపత్రిక). కథలు: మ్రోడపడిన చీర, డ్రామా మొదలైనవి. కవితలు: కొన్ని.

చేతిలో ఉన్న నార చీరం మూటను ఒక మూల విసిరి పడవేసి ఆర్భాటం చేస్తుంది) హాయ్‌హా భరతా! నీ కెన్ని కష్టాలు వచ్చాయిరా, తండ్రీ! ఈ ముసలి వయసులో నేను ఇంకెంత నికృష్టపు బతుకు బతకాలో కదా? ఎన్ని విపరీతాలు చూడాలో, ఏమో! అమ్మా కైకమ్మ తల్లీ! ఇంకా నిద్ర పోతున్నావేమి, తల్లీ? అయ్యో... అయ్యో! ఇంత జరిగినా నువ్వు నిశ్చింతగా నిద్ర పోతున్నావంటే, ఎంత అమాయకురాలివే, తల్లీ?!

కైకకు సపర్యలు చేస్తున్న చెలికత్తె: ష్. మెల్లిగా మాట్లాడు. మహారాణిగారు నిద్ర పోతున్నారు.

మంథర: ఓసి నీ పెత్తనం కాలబడి పోను. మహారాణి చెలికత్తెవని మురిసి పోతున్నావేమో. మహారాణి ఎవరే? ఈ నిర్భాగ్యురాలు కైక మహారాణి అనుకుంటున్నావా!

చెలికత్తె: మంథరా! శబ్దం చెయ్యకు. దేవేరి శయనించి ఉండడం కనిపించడం లేదా?

మంథర: ఇదిగో ఆ మాటే అనకు. నీ దేవేరి కావేరిలో మునకాల్సిన సమయం ఆసన్నమయింది. ముందామెను నిద్ర లేపు. అయినా, కైకకు అరణపు దాసి అయిన ఈ మంథరకు ఎలా ప్రవర్తించాలో చెప్పేటంతటి దానివా నువ్వు?! అమ్మా కైకా! నిదుర లేవమ్మా! తూర్పున లోకమంతటికీ పొద్దు పొడిచింది. నీ మొహాన మాత్రం అమావాస్య చంద్రుడు పొడుస్తున్నాడు.

కైక: (కళ్ళు నులుముకుంటూ నిదుర లేచి తల్పం మీద అలాగే కూర్చుని నవ్వుతూ) ఏమే... అప్పుడే తెల్లవారిందా నీకు? నిద్ర లేస్తూనే ఏం మునిగిపోయిందని ఇలా పరుగెత్తుకొచ్చావు? ఏదో ఆగడం చేసే ఉంటావు. లక్ష్మణుడు నిన్ను శిక్షించి ఉంటాడు. అవునా?

మంథర: (సమాధానం చెప్పకుండా శోకాలు పెడుతుంది)

కైక: (కంగారుగా పైకి లేచి) ఏమే...ఏం జరిగిందే? ఏమీ చెప్పకుండా ఎందుకలా శోకాలు పెడతావు. (మంథర సమాధానం ఇవ్వక పోవడంతో) చెప్పవే, మంథరా, ఏమయింది? మా మహారాజా, రాముడు, లక్ష్మణుడు, భరతుడు, శత్రుఘ్నుడు అందరూ క్షేమంగానే ఉన్నారు కదా!

మంథర: (చేసైగతో చెలికత్తెను వెలుపలికి పొమ్మని చెప్పి) అమ్మా! నీ కలా చెప్పాలో నాకు నోరు రావడం లేదు. నువ్వు అడిగిన వాళ్ళలో ఎవరికీ ఏ ప్రమాదమూ వాటిల్లలేదు కాని, అంతకు మించిన ఆపద నీకే కలగబోతోంది. నువ్వు ఉత్త అమాయకురాలివి. కల్లా కపటం తెలియదానివి. ఒక తియ్యని మాట తోనే కొండెక్కుతావు. నా భర్త ధర్మదేవత అని నువ్వెప్పుడూ అంటూ ఉంటావు కదా! ఆయన ధర్మదేవత అయిందీ, కర్మదేవత అయిందీ ఇప్పుడు కాని నీకు తెలీదు. కైకా! జరిగిన సంగతి చెబుతున్నాను. నువ్విప్పుడు పూడుపుగత్తె వయ్యావు.

కైక: (విసుక్కుంటూ) నీ గోల కట్టి పెట్టి అసలు విషయ మేమిటో చెప్పవే!

మంథర: ఆ పాడు వార్త నన్నెలా చెప్పమంటావు? రాముడికి పట్టాభిషేకం చేసి...

కైక: (ఒక్కమారుగా సంతోషంతో ఉప్పొంగిపోయి) ఎంతటి చల్లటి వార్త చెప్పావే, మంథరా! (తన మెడలోని దండ ఒకటి తీసి) ఇదిగో ఈ ముత్యాలహారం బహుమానంగా తీసుకో! (మంథర మెడలో హారాన్ని వేయబోతుంది)

మంథర: (విదిలించుకుని కైక ఇచ్చిన హారాన్ని విసిరి కొట్టి) నువ్వు అమాయకురాలివని ముందే చెప్పాను. ఇది సంతోషించాల్సిన సమయం కాదు. గుండెలు బాదుకుని ఏడవాలి. నీ అజ్ఞానాన్ని ఏమనాలో నా కర్థం కావడం లేదు. కన్నకొడుకు గురించి ఈషణ్మాత్రమయినా ఆలోచించకుండా సవతి కొడుక్కి పట్టం కడుతున్నారని ఉబ్బి తబ్బిబ్బవుతున్నావే, పిచ్చిదానా! నీ కంటే నిర్భాగ్యులు ఎవరుంటారు? దశరథుడు నీకు సరయిన వాతనే పెట్టాడు.

కైక: మంథరా! రాముడు, భరతుడూ ఇద్దరూ నా కొక్కటే! శ్రీరాముడు ఎలాంటివాడో నాకు తెలీదా? స్వార్థ మనేది ఏమిటో తెలీకుండా ఉన్నట్లు నన్ను తనతో పాటిగా ఆదరిస్తాడు. నిన్ను నిలిగి నిలిగి నడినా నిత్యానిదానం పలకడు. ధర్మజ్ఞుడు, శిక్షితుడు, పరిశుద్ధుడు అయిన రాముడు రాజు కావడం కోసలదేశపు అదృష్టం.

మంథర: అవునవును. చతుస్సముద్ర ముద్రిత ధరామండలేశ్వరి అయిన కౌసల్యకు పూడిగం చేయడమనే కొత్త కొలువును సంపాదించిన నీ సుకృతం మాత్రం తక్కువేమిటి? అయినా ఇవన్నీ నా కెందుకు! ఎవరు రాజైతే నాకు కలిగే నష్టమేమిటి? నా పూడిగం నాకు తప్పుతుందా? నేను రాణి కాబోవడం లేదు కదా.

నాకు తెలీకడుగుతాను ... పిచ్చిదానా! రాముడి తర్వాత రాజ్యం భరతుడికి సంక్రమిస్తుందన్న సంగతి నీకు తెలీదా? కైకా! రాజులు ఎలాంటి వాళ్ళో నీకు చెప్పాల్సిన అవసరం లేదు. రాముడు గొప్ప రాజనీతివేత్త. వాని పమేయమున్నా, ప్రతీకరణ శక్తి ఇంతింత అని చెప్పరానిది. విషయం స్పష్టంగా ఉంది. నీ కంతకన్నా వివరించి చెప్పలేను.

కైక: మంథరా! నీ బుద్ధి గతి తప్పింది. రాముడు పట్టాభిషిక్తుడు కావడం నీ కిష్టంలేదు కాబట్టి నువ్విలా ఆలోచిస్తున్నావు. ఆ రాముడు భరతుడి ప్రాణాలకు ముప్పు తెచ్చేటంతటి నీచుడు కాదు. అయినా రాజ్యం జ్యేష్ఠునికి కావడం ధర్మం. రాజనీతిజ్ఞుడయిన రాముడు నూరేండ్లు రాజ్యమేలనీ, ఆ తర్వాతనే భరతుడు రాజు కానీ— తొందర దేనికి?

మంథర: కైకా! నీలాంటి మూర్ఖ స్త్రీని నే నెక్కడా చూడలేదు. రాజ్యం జ్యేష్ఠునికి అని నువ్వే కదా అంటున్నావు. ఆ రాముడికి కుమారుడు కలగడా? వాడు రాజు కాడా? నీ కుమారుడికి రాజ్యమెలా దక్కుతుంది? పుత్రుడి అభ్యుదయం తల్లి ఇలాగేనా కోరేది? కైకా! నా బాధ నీ గురించి కాదుగాని, నేను చేతులారా పెంచిన ఆ భరతుడి గురించి... హో భరతా... హాయ్‌హా! నువ్వు మళ్ళీ ఈ కోసల దేశంలో అడుగుపెట్టకు. బతికుంటే బలుసాకు తినవచ్చు. నువ్వు ఈ వైపు రాకు. శేషజీవితాన్ని నీ మేనమామ పంచలోనే గడిపెయ్.

అమ్మా కైకేయీ! రాముడు రాజనీతిజ్ఞుడని కూడా నువ్వే అన్నావు కదా!

ఇక నీ కొడుక్కి వీళ్ళ వదులుకో. రాజులు రాజ్యానికి అవకాశమున్న అందర్నీ కూడా ముందే పొమ్మని వారిని తొలగించుకుంటారు. భరతుడు విద్వేషి అయినా, రాజ్యానికి అతడే సన్నిహితుడు కాబట్టి రాముడు వాణ్ణి బ్రతకనిస్తాడా?

కైక : మంథరా! నువ్వెన్ని చెప్పినా రాముణ్ణి అనుమానించడానికి నా మనస్సు అంగీకరించడం లేదు.

మంథర : అవునమ్మా! విషం చెలితే విస్మయమని ఊరికే అనరు. అయినా, రాజా రాముడయితే నా కేందుకు? ఇంకొకడయితే నా కెందుకు? కూలిదాన్ని—ఎవడు రాజైనా, నా కూలి నాకు తప్పదు. పిండానికి ఊళ్ళుండవుగాని, అడుక్కుతినడానికి ఊళ్ళుండవా? రాముడు నా కెప్పుడూ ఎలాంటి కీడూ చెయ్యలేదు. నేనంత కొళ్ళేనిదాన్ని కాను.

కైక : ఇన్ని విస్మరాలెందుకే, మంథరా?

మంథర : అవునమ్మా! ఇది విస్మరమే! ఒక ప్రశ్నకు నాకు సమాధానం చెప్పు. నువ్వు, నీ భర్త ఎలా ఉంటారు?

కైక : ఆయన అనురాగాన్ని నన్నిలా వివరించమంటావు? సర్వావస్థల్లోనూ మా రెండు హృదయాలూ ఒకటిగానే ఉంటాయి.

మంథర: నన్ను క్షమించమ్మా! నీకు రామ పట్టాభిషేకం సంగతి ముందే తెలుసన్న విషయం నాకు తెలీలేదు.

కైక : అదేమిటే! నువ్వు చెప్పేంతవరకూ ఆ సంగతే నాకు తెలీదు.

మంథర : మరయితే మా ఇద్దరి అంతరాత్మలూ ఒకటే అంటున్నావు. ఇంత ముఖ్యమైన విషయాన్ని నీ నాథుడు మాటమాత్రమయినా చెప్పలేదా? పోనీ, పట్టాభిషేకం జరుగుతోందని భరతుడికి వర్తమాన మయినా పంపాడా?

కైక : ( దీర్ఘాలోచనలో మునిగిపోయింది. )

మంథర : అమ్మా! దశరథుడికి నీ మీద, నీ కొడుకుమీద ఉన్న ప్రేమంతా బూటకం. నా కీ సంగతి ఎప్పుడో తెలుసు. ఇప్పటికైనా నువ్వు నిజం గ్రహించు. ముహూర్తకాలం సమీపిస్తోంది.

కైక : ( నిట్టూర్పులు విడుస్తూ ) భరతుని కేకయ రాజ్యానికి పంపడం... విషయం నాతో ఇంతవరకూ చెప్పక పోవడం... పట్టాభిషేకం రేపే కావడం— ఇవన్నీ మాయా వ్యూహంలోని భాగాలని స్పష్టంగా తెలుస్తున్నాయి. మాట మాత్రంగానయినా నా కీ సంగతి తెలియజెయ్యడానికి రాజుకు నిజంగా వ్యవధిలేక పోయిందా? అంతా బూటకం .. ఇది కౌసల్య మత్సరంతో వచ్చిన వ్యూహమైనా కావచ్చు. మంథరా! నువ్వు పలికిన ప్రత్యక్షరమూ అక్షర సత్యమే! సత్వరమే ప్రతిక్రియ ఆలోచించు.

మంథర : అమ్మా! బ్రహ్మాస్త్రాలు చేతిలో ఉంచుకొని వెదురుకర్రల కోసం ఎందుకు వెతుకుతావు? దేవాసుర యుద్ధసమయంలో నువ్వు చేసిన సహాయానికి రెండు వరాలు కోరుకొమ్మని నీ పతి నిన్నడిగాడు కదా! వాటి నిప్పుడు ఉపయోగించుకోవాలి మరి.

కైక : అదెలా?

మంథర : భరతుడికి పట్టాభిషేకం జరిపించడం ఒక్కవరం... రాముడికి పద్నాలుగేళ్ళపాటు అరణ్యవాసం విధించడం రెండో వరం.

కైక : మంథరా ... కుబ్జవైనా నీలో ఇంతటి ప్రజ్ఞ దాగి ఉందని నే ననుకోలేదు. సంతోషంగా భరతుడికి పట్టాభిషేకం జరిపిస్తాను. కాని, మంథరా! రాముణ్ణి వనవాసానికి పంపమని చెప్పడానికి మాత్రం నా మనస్సు అంగీకరించడం లేదు. ఆ రాముడు నన్ను కన్నతల్లికన్నా ఎక్కువగా అభిమానిస్తాడు. వాణ్ణి చూడని రోజు నాకు దుర్దినంగా ఉంటుంది. ఏ పాపమూ ఎరుగని నా రాముణ్ణి వనవాసానికి పంపమని అడగడానికి నాకు నోరెలా వస్తుంది?

మంథర : కైకా! రాముడు మహా రాజనీతివేత్త. ప్రజలందరికీ ఆ రాముడి మీద విపరీతమైన అభిమానం ఉంది. రాముడు రాజ్యంలో ఉన్నంతకాలం ప్రజల మనస్సుల్లో వాడే తిష్ఠ వేసుకుని కూర్చుంటాడు. ఇది రాజైన భరతుడికి ముప్పు తెస్తుంది. పక్కలో ఎప్పుడూ ఈటెను ఉంచుకోకూడదు.

రాముడు అడవుల పాలయితే కొన్నాళ్ళకు జనం వాణ్ణి మరిచిపోతారు. పద్నాలుగేళ్ళ కాలం అందుకోసమే! భరతుడు ప్రజల హృదయాలను పూర్తిగా ఆకట్టుకోవడానికి ఆమాత్రమున్నా వ్యవధి కావాలి. కైకా! ఈ రెండు వరాలు నెరవేర్చుకో! ఆ తర్వాత నిశ్చింతగా ఉండొచ్చు. (తను రంగప్రవేశం చేసినప్పుడు



విసిరి పడవేసిన నార చీరల మూటను అందుకొని ) ఇదిగో ... ఇందులో నారచీరలున్నాయి. రాముణ్ణి వీటిని కట్టుకొని అడవులకు వెళ్ళమని చెప్పు.

( కైక లోపలగా వెళ్ళి తల్పం మీద కూర్చుంటుంది. మంథర దేదీప్యమానంగా వెలుగుతున్న దీపాలలో కొన్నింటిని ఆర్పివేస్తుంది. )

పరిచారిక: ( బయటి నుండి లోనికి హడావిడిగా ప్రవేశించి) మహారాణికి మంగళమగుగాక! ప్రభువుల వారు తమ మందిరం దిశగా వేంచేస్తున్నారు. ( అని చెప్పి వెళ్ళిపోతుంది )

మంథర కైకా! శుభసమయం తనంతట తానే వెతుక్కొస్తోంది. వస్తున్నది నీ నాథుడు. ఇప్పుడు నువ్వున్నది కోపగృహం అంటికి లెక్క. ఎలా నటించి నీ నాథుణ్ణి కరిగిస్తావో, ఏమో! నేను వెళుతున్నాను నిష్క్రమిస్తుంది.)

(తల్పంమీది నుండి పైకి లేచిన కైక మెడలోని హారాలను తీసి చిందర వందరగా పడవేస్తుంది. తలలోని పూలను విసిరివేస్తుంది . వడ్డాణము, చంద్రహారము, బంగారు గాజులు అన్నింటినీ తీసివేసి కింద పడవేస్తుంది. జడ అల్లిన జుట్టును విప్పి వెండ్రుకలు విరబోసుకుంటుంది. కటికనేలమీద పడి 'హా విధీ' అంటూ అటూ ఇటూ దొర్లసాగింది.



కొన్ని క్షణాల వ్యవధి తరవాత లోనికి ప్రవేశించిన దశరథుడు అయోమయంగా కాళ్ళకు తగులుతున్న ఆభరణాలను తప్పించుకుంటూ కైకను గుర్తిస్తాడు. ఆదుర్దాగా ముందుకు వంగి తాకబోగా అతని చేతి వేళ్ళను కైక విసిరికొడుతుంది.

దశరథుడు ఆమె పక్కన కూర్చొని అనునయంగా "కైకా!" అని పిలిచి చేతుల్లోకి తీసుకోబోగా ఆమె అటు తిరిగి పడుకుంటుంది

దశరథుడు : ప్రేయసీ! విషయ మేమిటి? ఎందుకు అలిగావు? నీ ఆజ్ఞలను ఎవరైనా ఉల్లంఘించారా? అప్రియంగా ఎవరైనా మాట్లాడారా? సుందరాంగీ! నీ అలకకు కారణమేమి? దశరథుడు నీవాడై ఉండగా ఏ కొరత వాటిల్లింది?

కైక : ( సమాధానం ఇవ్వకుండా ముసుగు మరింతగా బిగిస్తుంది.)

దశరథుడు: తన్వీ! స్త్రీలలో నీ కన్నా, పురుషులలో రాముడికన్నా నాకు ప్రియమైనవాళ్ళెవరూ లేరు. నీ ఆజ్ఞ రాముడి ఆజ్ఞ. నీ ఇష్టమేమిటో చెప్పు. దాన్ని ఆజ్ఞగా నెరవేరుస్తాను. నా రాముడి మీద ఆన.

కైక: (క్రోధంగా కళ్ళు తెరిచి ) నాథా! రాముడి మీద ప్రమాణం చేశావు కదా! నా కోరిక తప్పక నెరవేరుస్తావుగా!

దశరథుడు: ప్రాణేశ్వరీ! నెరవేరుస్తానని వాగ్దానం చేసిన తరవాతకూడా అనుమానంగా ఎందుకడుగుతావు? మిత్రులు శత్రువులుకానీ, ప్రజలు దూషించనీ,

కుమారుల ఎడబాటు కలగనీ, రాజ్యలక్ష్మి హరించుకపోనీ ఎలాంటి పరిణామం కలుగుతున్నా నా మాటకు తిరుగు లేదు.

కైక: నాథా! నే నడగ్గోయేది చాలా స్వల్పమయిన విషయం. నువ్వు నవ్వకూడదు. నాకో ధర్మసందేహం కలిగింది. దాన్ని తీర్చడానికి పండితులు లేరా అనకండి. కేవలం శాస్త్రజ్ఞానం ఇందులో ఉపయోగపడదు. అనుభవ జ్ఞానం కూడా కావాలి. చాలా కాలం క్రితం సంగతి. ఏదో సందర్భంగా ఒక చెలికత్తె 'నాకు సంతోషం కలిగించింది. 'ఏం కావాలో కోరుకో! ఇస్తాను' అన్నాను. 'ఇప్పుడు వద్దు. కావలసినప్పుడు కోరుకుంటాను' అంది. ఇది జరిగి ఏండ్లు పూండ్లు గడిచిపోయాయి. ఈ సంగతే నేను మరిచిపోయాను. నాథా! ఈ రోజు ఆ చెలికత్తె వచ్చి ఒక విపరీతమైన కోరిక కోరుతూంది. నాడు వరం ఇస్తానన్నాను. అంతేకాని ఇది అది అని ఆమె కోరలేదు. నేను చెప్పలేదు. ఇప్పుడు నేను కాదంటే అది తప్పినట్లు అవుతుందా?

దశరథుడు: దేవీ! సందేహం ఎందుకు? సంకల్పం ప్రధానం. ఇవ్వాలన్న సంకల్పం ఎప్పుడయితే నీలో పుట్టిందో అప్పుడే అది దత్తమైనట్లు. ఏం



కోరినా కోరినదాన్ని ఇవ్వవలసిందే. సత్యానికి కాలపరిమితి దోషం ఉండదు. ధర్మాన్ని నువ్వు వ్యతిరేకించకు. నీ చెలి కోర్కె ఏమిటో చెప్పు. నీ బదులు నేను తీరుస్తాను.

కైక: నాథా! నేను సాక్ష్యమయ్యే పని రేపు కాకపోవడానికి అవకాశం ఉంది. కోరిక నెరవేర్చే మార్గం లేనప్పుడు..

దశరథుడు: ఎట్టి పరిస్థితుల్లోనూ మాట తప్పకూడదు.

కైక: ( తృప్తిగా నిట్టూర్చి ) నాథా! ధర్మంలో పుట్టి, అందులోనే పెరిగి ఆ ధర్మమే ప్రాణంగా జీవిస్తున్న నీ లాంటి వాళ్ళకే ఇలాంటి ధర్మ సూక్ష్మాలు తెలుస్తాయి. ఇంతవరకూ నేను సూచ్యార్థ సూచికగా మాట్లాడాను. దేవాసురయుద్ధం జరిగినప్పుడు నువ్వు నాకు రెండు వరాలిచ్చావు. గుర్తుందా?

(దశరథుడు: నవ్వి ) ప్రాణేశ్వరీ! ఆ నాడే ఏమిటి? ఈ రోజు నువ్వు కోరితే మాత్రం నేను కాదంటానా? దశరథుడు నీ వాడే కదా! ఏం కావాలో కోరుకో! తప్పక ఇస్తాను.

కైక: నాథా! అభిషేక సంబరాలన్నీ సిద్ధంగా ఉన్నాయి కదా! వాటితో భరతుడికి పట్టాభిషేకం చేయించు. ఇది మొదటి వరం.

దశరథుడు: ( ముఖం కళావిహీనం కాగా దేహం చలించిపోతుంది. వినలేనట్టు రెండు చెవులూ మూసుకుంటాడు )

కైక: రాముడికి నార చీర లిచ్చి పద్నాలుగేళ్ళ పాటు అరణ్య వాసానికి ఈ రోజే పంపు. ఇది రెండవ వరం. ఇక్ష్వాకు వంశానికి కళంకం తీసుకురాకుండా వెంటనే ఇవి నెరవేర్చి నీ వాగ్దానం నిలబెట్టుకో!

దశరథుడు: ( పిడుగు పడిన తాటిచెట్టులా నిలువునా కిందికి కూలి పోతాడు. కొన్ని క్షణాల నిశ్శబ్దం తరవాత. నేలమీదే శరీరాన్ని ఈడ్చుకుంటూ ముందుకు జరిగి ) కైకా! ఇంతటి కఠిన పాషాణ హృదయం నీకు తగదు నా ప్రేయసి నవనీత హృదయ. ఇలాంటి కోరిక ఎన్నడు కోరదు. చెప్పు! కైకా, నువ్వు కోరింది పరిహాసానికని, ఆ మాటలు నిజం కావని చెప్పు కైకా! అయ్యో. నువ్వు మాట్లాడకపోతే నా శరీరంలో ప్రాణాలు నిలవ్వు.

కైక: ( తోక తొక్కిన త్రాచులా ఒక్క ఉదుటున పైకి లేచి ) ఇలాంటి వరాలు కాకుండా నువ్విచ్చిన వాగ్దానానికి పిడికెడు పేలాలు కోరుకుంటా నని అనుకున్నావా? నాథా! వాగ్వాదమెందుకు? నీకు సాధ్యమయితే నా కోరికలు తీరుస్తానని చెప్పు. లేకుంటే నిలుపడని నిర్మొహమాటంగా చెప్పు. ఇందులో వితర్కమెందుకు?

దశరథుడు: కైకా! రాముడు నీకుచేసిన ద్రోహమేమిటి? కన్నతల్లికన్నా ఎక్కువగా వాడు నిన్ను చూసుకున్నందుకు ఇదా నువ్విచ్చే ప్రతిఫలం? కౌసల్యా సుమిత్రల్ని ఇద్దర్నీ వదిలి పెట్టమన్నా నే వింత బాధపడను. రాజ్యం కావాలన్నా పంతయించకుండా ఇస్తాను. రాముణ్ణి నే నెలా వదలగలను?

కైక: నాకు తెలుసు. నీకు మొదటినుండి రాముడన్నా, కౌసల్య అన్నా ప్రేమ కాని నేనూ, భరతుడూ ఏ గంగలో దుమికినా నీకు పట్టింపు లేదు.

దశరథుడు: పాతకీ! ఈ దుష్టబుద్ధి నీకు పుట్టింది కాదు. నీ కొడుకు భరతుని మనస్సే నీకు తెలీదు. వాడు పట్టాభిషేకానికి కాని, రామవనవాసానికి కాని అంగీకరిస్తాడనే అనుకుంటున్నావా? అయ్యో! నీ మాటలకు అంగీకరించి పెద్దల ముందు నే నెలా తలెత్తుకోగలను?

కైక: మృత్యుముఖం నుండి తప్పించిన ప్రాణసతికి వాగ్దానం చేసి తప్పు కున్నానని ఆ పెద్దలతోనే చెప్పు. ఎలా తలెత్తుకోవడమంటావా? నీతిలేని వాడికి ఏ లోకమైతే ఏమి?

దశరథుడు: కైకా! నువ్వు కోరినట్లు భరతుడికి పట్టాభిషేకం చేయిస్తాను కాని, రాముణ్ణి వనవాసానికి పంపమని మాత్రం అడక్కు. నీటిని వదిలి చేప బతుకు తుందేమో కాని, రాముణ్ణి వదిలి నేను జీవించలేను.

కైక: దాని కంగీకరించకపోతే నేనూ జీవించను. ఈ ముదిమి వయసులో కీర్తినో, అపకీర్తినో ఎంచుకోవాల్సిన అవకాశం నీ చేతుల్లోనే ఉంది. ఆలోచించు. ఇన్నాళ్ళు అమిత ధర్మవేత్త అని కీర్తితో బ్రతికి ఇప్పుడు అల్లరి కావద్దు. ఇచ్చిన వాగ్దానాన్ని పాలించలేని వాణ్ణి పురుషాధముడు అంటారు.

దశరథుడు: ( పళ్ళు పటపటమని కొరికి ) ఛీ! పాపీ! ఇక నువ్వు నా భార్యవి కావు. నేటితో మనిద్దరికీ తీరిపోయింది ... అదిగో సూర్యోదయ మవుతోంది. గురుజనాలు అభిషేక ద్రవ్యాలు సిద్ధంచేసుకొని నా కోసం ఎదురు చూస్తుంటారు.

కైక: అయితే ఏమిటి? ప్రతిజ్ఞ చెల్లిస్తున్నావా? లేదా?

దశరథుడు: ( దుఃఖావేగాన్ని ఓర్చుకోలేక ) హా రామా! ( అంటూ మూర్ఛపోతాడు )

( బయటి నుండి మహారాజుకోసం వర్తమానం తీసుకొస్తున్న సుమంత్రుడు లోనికి రాబోయేసరికి తనే నాలు గడుగులు ముందుకు వడిచింది. )

సుమంత్రుడు: ఏలినవారికి జయమగుగాక! గురుదేవులు వసిష్ఠుడు బ్రాహ్మణ సమేతంగా పట్టాభిషేక సంబారాలన్నీ సిద్ధంచేయించి తమ రాకకోసం ఎదురుచూస్తున్నాడు. శ్రీరామచంద్రుడు తండ్రి దర్శనంకోసం ప్రతీక్షి స్తున్నాడు. ప్రభువులు సత్వరం కర్తవ్యాన్ని ఆదేశించాలి.

కైక: సుమంత్రా! ప్రభువులు రాత్రి నిద్రలేక పోవడం వల్ల నీరసించి ఉన్నారు. నువ్వు వెంటనే రాముడి వద్దకు వెళ్ళి ప్రభువుల ఆజ్ఞగా ఇక్కడికి తీసుకుని రా!

( సుమంత్రుడు వెళ్ళిపోగానే కైక ఒక వింజామరను అందుకొని దశరథుడి తలవైపు కూర్చుని విసర సాగింది.

రెండు క్షణాల తర్వాత లోని కడుగు పెట్టిన రాముడు పరిస్థితి వూహించ లేక పోయాడు. తల్లివంక, తండ్రివంక అయోమయంగా చూడసాగాడు. )

దశరథుడు :( రాముని అలికిడి విని నీళ్ళు నిండిన కళ్ళు తెరిచి) రా...మా...

రాముడు :( ఉద్వేగాన్ని, దుఃఖాన్ని ఆపుకోలేక కైకకు నమస్కరిస్తూ ) తల్లీ! తండ్రి ఈ దురవస్థకు కారణ మేమిటి? అందరికీ కుశలమేకదా! భరత, శత్రుఘ్నులు క్షేమంగానే ఉన్నారు కదా! నా తండ్రి కళ్ళల్లో నీ రెందుకు చిందు తోంది? తెలిస్తే నువ్వైనా సెలవీయవమ్మా?

కైక : నాయనా! కంగారు పడాల్సిన అగత్యమేమీ లేదు. ధర్మ సందేహ మొకటి నీ తండ్రిని బాధిస్తోంది. ఒక విషయంలో తను ఆడి తప్పడమా, తప్పక పోవడమా అన్నది అతడి మీమాంస.

రాముడు : తల్లీ! ఆ ప్రసక్తి ఎందుకు రావాలి? ఆడిన మాట ఎన్నడూ తప్పకూడదు.

కైక : రామా! నువ్వుకూడా నీ తండ్రిలాగానే మాట్లాడుతున్నావు... నా కొకప్పుడు నీ తండ్రి రెండు వరాలు వాగ్దానం చేశాడు. వాటిని నే నిప్పుడు కోరాను. తనకు ధర్మసంకట మేర్పడింది. నీ మీది మోహం ఒకవైపు, నాకుచేసిన వాగ్దానం ఒక వైపు నీ తండ్రిని క్రుంగదీస్తున్నది. శక్తి ఉంటే నీ తండ్రి ఆజ్ఞను శిరసావహించి అతడి దుఃఖాన్ని తొలగించవచ్చు.

రాముడు : అమ్మా! రాముడు తండ్రి మాటకు ఎదురాడడు. ఆడితప్పడు. నువ్వు కోరిన వరా లేవో చెప్పు. నా తండ్రి మారుగా వాటిని నేను సాధిస్తాను.

కైక : నాయనా! మీ తండ్రీ, కొడుకులకు సాధ్యం కాని వరాలేమీ నేను కోరలేదు. అన్నీ మీ అరచేతుల్లో ఉన్నవే! భరతుడికి పట్టాభిషేకం చెయ్యమని, నీకు పధ్నాలుగేళ్ళ అరణ్యవాసం విధించమని నీ తండ్రిని కోరాను. తన నోటితో ఈ మాటలు చెప్పలేక నీ తండ్రి మథనపడుతున్నాడు. జనకుని కీర్తి కాపాడదలిస్తే వీటిని చెల్లించు.

రాముడు :( దీనంగాచూస్తూ ) తల్లీ! ఈ విషయమై నాకు ఒకే బాధ కలుగుతోంది. ( కైక ఉలికిపడుతుంది. దశరథుడు సిగ్గుతో మరింత ముడుచుకు పోతాడు. )

రాముడు : అమ్మా! ఇంతటి స్వల్పమైన కోరికలు కోరడానికి, స్వయంగా చెప్పి ఆజ్ఞాపించడానికి నా తండ్రి వెనుకంజ వేసి నీ నోటితో చెప్పించాడు. ఇదే నా బాధ. తను నా పితృ భక్తిని ఎందుకు శంకించాడో అర్థం చేసుకోలేకపోతున్నాను. తల్లీ! నా తండ్రి ఆజ్ఞను నెరవేర్చడానికి రాజ్యాన్నే కాదు—సీతను, నా ప్రాణా న్నైనా తృణీకరిస్తాను. రాముని తత్వం పూర్తిగా అవగతం కాకపోవడంవల్లనే మీ రింతగా సంశయానికి లోనయ్యారు. అమ్మా! వాయువేగంతో భరతుడికి వర్తమానం పంపించు. నే నిప్పుడే నార చీరలు ధరించి వనవాసానికి బయలు దేరుతాను.

( దశరథుణ్ణి పైకి లేవనెత్తి ) తండ్రీ! రాజభోగాలకు నీ రాము డెప్పుడూ దాసుడు కాదు. నీ ఆజ్ఞను తల్లి ముఖాన విన్నాను. నా భాగ్యవశం కొద్దీ వాటిని నెరవేర్చే అవకాశం నాకు కలిగింది. నీ రాముడు నీ కెప్పుడూ ఎదురాడడు. సంశయాన్ని వదిలిపెట్టు.

( కుమారుడి ముఖంలోకి సూటిగా చూడలేక దశరథుడు తల క్రిందికి వంచుకుంటాడు. )

తల్లీ! వీటిని ఒక వరాలుగా నువ్వు నా తండ్రిని యాచించాలా? నన్ను పిలిచి, 'రామా! నా కిది ఇష్టం. ఇలా ప్రవర్తించు' అంటే నేను కాదంటానా?

దశరథుడు : రామా! నీ చేత పరిత్యజించబడే ఈ అయోధ్య ఎంత అభాగ్యమైనది! నన్ను కూడా నీతోబాటు తీసుకెళ్ళమంటే నువ్వు సందేహిస్తావు. రామా! అందరికీ నువ్వు పరమ ప్రియుడివి. నాకు ప్రాణానికి ప్రాణానివి! అలాంటి నువ్వు 'తండ్రీ! అడవుల కెళుతున్నాను' అంటే ఏడుస్తున్నాను కాని, ఆ మాటలు విన్న వెంటనే గుండెలు పగిలి చావలేదు. కాబట్టి నాది మిథ్యాప్రేమ. ఈ మిథ్యా ప్రేమను అతిశయోక్తిగా చెప్పి నువ్వు వనవాసానికి వెళ్ళొద్దని హితం చెయ్యను. రామా! ఈ దుర్భాగ్యుణ్ణి గుర్తుంచుకుంటావు కదూ!

తెలకత్తె :( లోనికి ప్రవేశించి ) ఏలిన వారికి జయమగుగాక! రఘువుల అంతరంగికుడైన సుమంత్రుడు సీతాదేవితోబాటు లోనికి వస్తున్నాడు. ( నిష్క్రమిస్తుంది. )

( సుమంత్రుడి వెనుకగా లోనికి ప్రవేశించిన సీత తడబడుతున్న అడుగులతో రాముడి ముందుకెళ్ళి కాళ్ళకు నమస్కరిస్తుంది. )


సీత : (రాముడితో దీనంగా) ప్రభూ! ఏలిన వారు మిమ్మల్ని కోసల రాజ్యానికి కాక, కానన రాజ్యానికి పట్టాభిషిక్తుల్ని చేస్తున్నారని నగరమంతా ఒక వార్త వ్యాపిస్తోంది. అడవులకు మీ వెంటవచ్చే అదృష్టం నా కున్నదో, లేదో తెలియడం లేదు. మీ రనుమతిస్తే నా శరీరము, ప్రాణము రెండూ మిమ్మల్ని అనుసరిస్తాయి. వలదంటే శరీరాన్ని వదిలిన ప్రాణాలు మాత్రం మిమ్మల్ని వెన్నంటి వస్తాయి.

రాముడు : జానకీ! దుఃఖించకు. మహాధర్మిష్ఠుడైన జనక మహారాజు ఇంట పెరిగిన దానివి. ధర్మ పరిపాలనార్థం ప్రాణాల నయినా త్యజించాలన్న విషయం నీకు తెలియనిది కాదు. ఈ పధ్నాలుగేళ్ళు మనసు దిటవు పరచుకొని అత్తమామల సేవలో కాలం గడుపు.

సీత : నాథా! భార్యను సహధర్మచారిణి అంటారు. ధర్మాచరణలో పతికి సతి తోడు కావడం విధి విహితము. పైగా వనవాసానికి భర్తను ఆజ్ఞాపించడం భార్యను ఆజ్ఞాపించినట్లే అవుతుంది. భార్య అర్ధాంగి కాదా! శరీరంలో సగభాగాన్ని వదిలి మీరు మాత్రమే ఎలా వెళతారు?

రాముడు : సీతా! అరణ్యవాసం చాలా క్లేశ భూయిష్ఠము. నీకు సాధ్యం కాదు.

సీత : నాథా! ప్రసంగాంతరాలతో నా మనసు మార్చడానికి ప్రయత్నిం



చకండి. ఎవరైతే మీ ఎడబాటును క్షణమైనా ఓర్చుకోలేదో, ప్రకృతి పురుషుని వలె ఎవరైతే మిమ్మల్ని సర్వకాలం సర్వావస్థల్లోనూ విడవాదో అట్టి అబలకు పధ్నాలుగేళ్ళ వియోగమనే క్రూర శిక్షను విధించడం మీకు న్యాయం కాదు. త్రికరణ శుద్ధిగా ప్రార్థిస్తున్నాను—నన్ను మీ వెంట రానివ్వండి.

( రాముడు భార్యను అనునయంగా దగ్గరకు తీసుకుంటాడు. )

రాముడు : దేవీ! దుఃఖించకు. నీకు ఇష్టంలేకపోతే స్వర్గాన్ని కూడా తృణీకరిస్తాను. మానవంతుడు కీర్తిని వదిలిపెట్టని విధంగా నిన్ను నేను వదిలి పెట్టను.

దశరథుడు: రామా! ఈ ఘోరాన్ని నేనిక చూడలేను. మూర్ఖుడైన నీ తండ్రిని ఎదిరించి రాజ్యాన్ని స్వాధీనం చేసుకో!

రాముడు : తండ్రీ! అలాంటి మాటలనకు! పధ్నాలుగు సంవత్సరాలంటే ఎంత? అతి శీఘ్రంగా గడిచిపోతాయి. ఆ తర్వాత మీ పాదసేవ చేసుకుంటూ కాలం గడుపుతాను.

సుమంత్రుడు: అమ్మా కైకేయీ! రాజ్యం జ్యేష్ఠ క్రమాగత మనే అనాది ధర్మాన్ని అస్తవ్యస్తం చెయ్యకు. రాముడు అడవులకు వెళితే ఈ రాజ్యంలో ఎవరు నివసిస్తా రనుకుంటున్నావు? అందరూ ఆ రాముడి వెంటే కానలకు

చెదిరిపోతాడు. ఆ తరవాత నీ భరతుడు పాలించాలిసింది పాడుబడిన భవనాలను, కదంలేని చెట్లూ చేమల్నే మాత్రమే! నీ ఈ క్రూర కార్యానికి భూమి ఇంతవరకూ బద్దలు కాకపోవడం నాకు ఆశ్చర్యంగా ఉంది.

కైకా! ఇప్పటికైనా మించి పోయింది లేదు. రామ పట్టాభిషేకానికి అంగీకరించు. నీ నాథుడికి మనశ్శాంతి కలిగించు.

కైక: ( ముఖం పక్కకు తిప్పుకుంటుంది )

దశరథుడు: ( సుమంత్రుడితో ) మిత్రమా! రాముని వనవాసార్థం చతురంగ బలాన్ని రత్నరాసులతో పాటు పంపించు. రాముని మిత్రవర్గాన్ని, భృత్యకోటిని వానివెంట తరలించు. నా కుమారుడు తను అరణ్యంలో ఉంటున్న సంగతి విస్మరించి ఇచ్ఛా విహారంతో సుఖంగా ఉండటానికి కావలిసినవన్నీ సమకూర్చి పంపు.

కైక: రాజ్యాన్ని ప్రాణ శూన్యం చేసి పిప్పిని భరతుడి కివ్వాలని సంకల్పిస్తున్నావా?

దశరథుడు: ( కోపావేశంతో ) కూ(నా)! దుర్భరమైన భారం నా నెత్తిన వేసి నన్ను పాతాళానికి అణగ దొక్కావు. అది చాలదన్నట్లు అపైన మన్నుకూడా పోస్తున్నావా? ఏ వరాలయితే నువ్వు కోరావో వాటిని మాత్రమే గ్రహించు. అధికంగా మాట్లాడకు.

రాముడు: తండ్రీ! ఏనుగును దానం చేసిన దాత దానిని కట్టిన త్రాటి కోసం ఆశిస్తాడా? ఎల్ల అర్థాలను విసర్జించాను. సైన్యసామగ్రులు నా కెందుకు? ఎవ్వరూ నా వెంట రానవసరం లేదు. అవన్నీ ఎందుకు?

కైక: ( మంధర తన చేతి కిచ్చిన నారచీరల మూటను విప్పి వస్త్రాలను అందుకొని ) ఇవిగో. ( రాముడి చేతికిచ్చి ) ధరించు.

(రాముడు నార చీరల్ని కళ్ళ కద్దుకుని ఒకటి సీత కిచ్చి, ఇంకొకటి తను పట్టువస్త్రం పైనే చుట్టుకుంటాడు. )

సీత: ( రాముడు తన చేతికిచ్చిన చీరలు ఎలా చుట్టుకోవాలో తెలీక ) నాథా! అడవుల్లో నివసించే స్త్రీలు వీటి నెలా ధరిస్తారో నాకు తెలీదు. ( ఒకటి మెడ మీద వేసుకుని ఇంకొకటి చేతిలో పట్టుకుని నిలబడుతుంది )

(రాముడు సీత వద్దనుండి వస్త్రాలు అందుకుని ఆమెకు తనే కట్టబెడతాడు. అందరూ దుఃఖంతో గొల్లుమంటారు. )

దశరథుడు: ( నుదుట బాదుకుంటూ ) అయ్యో! నా అజ్ఞానం ఎన్ని అనర్థాలకు మూలమయింది? వెదురు పూత పూచినట్లు నా తెలివి ఇలా పూచి ఆత్మ వినాశానికి కారణమయింది. ( కైక వంక తిరిగి ) కులఘ్నీ! రాముడు నీకు శత్రువు అగుగాక! సీత ఏం చేసింది? పాపీ! ఆ బిడ్డకు నారచీరలు అందియ్యడానికి నీకు చేతులెలా ఆడాయి?

( సీతారాములు కైకేయీ, దశరథుల కాళ్ళకు నమస్కరిస్తారు. )

రాముడు: తండ్రీ! అనుజ్ఞ ఇవ్వు. కానలకు వెళ్ళి వస్తాను.

దశరథుడు: నా ప్రియపుత్రుడి మునివేషాన్ని చూడటానికి ఇంకి నా కన్నులు మూసుకొని పోతున్నాయి. దుఃఖము నోరాడ నీయడం లేదు. ప్రాణాలు వదిలి పెట్టని ఈ మొండి శరీరాన్ని నే నింకా ఎన్ని దినాలు అనుభవించాలో? దుర్భాగ్యురాలా! నీ సామ్రాజ్యానికి పట్టం కట్టడానికి నా కన్నా ఇంకెవరూ నీకు దొరకలేదా. పాతకీ! నా రాముడు పుట్టినప్పటి నుండీ వాడి ముఖం చూడని రోజు దుర్దినంగా భావిస్తున్నానే. అలాంటి నా రాముణ్ణి నా నోటితో నేనే ఈ నాడు బహిష్కరిస్తున్నాను.

సుమంత్రుడు: మహారాజా! దుఃఖించకు. ఆజ్ఞాపిస్తున్నది నువ్వు కాబట్టి ప్రతిఘటించకుండా రాముడు శిరసావహిస్తున్నాడు. రాముడు తలచుకుంటే సర్వ లోకాల్నీ తన కాలిగోటి కిందికి తెచ్చుకోగల సమర్థుడు. తను ఆగ్రహించి సంధిస్తే దిగ్గజాలు వణికిపోతాయి. కుల పర్వతాలు చలిస్తాయి. సూర్య చంద్రులు కళావిహీను లవుతారు. రాజా! నీ రాముడు భయపడేది ఒక్క ధర్మానికే కాబట్టి నీ మాటకు కట్టుబడి అడవుల పాలవుతున్నాడు.

రాముడు: ( తను ఇంకా అక్కడే ఉంటే తండ్రి దుఃఖం అధిక మవుతుం దని ) తండ్రీ! కాలయాపన దేనికి? అనుమతిస్తే బయలుదేరుతాను.

దశరథుడు: ( కుమారుణ్ణి గాఢంగా కౌగిలించుకుని కిందికి జారిపోతూ ) రామా! నన్ను వదిలి వెళ్ళి పోతున్నావా? నీ వియోగంతో నేను ప్రాణాలతో జీవిస్తాననే అనుకుంటున్నావా, తండ్రీ! నా మీద దయలేదా?

సుమంత్రుడు: ( దశరథుణ్ణి సముదాయిస్తూ ) మహారాజా. ( తల్పం వద్దకు నడిపిస్తూ ). రథం మీద తీసికెళ్ళి సీతారాముల్ని దిగ విడిచి వస్తాను.

దశరథుడు: నా కళ్ళతో నే నా దృశ్యాన్ని చూడలేను.

( రాముడు తండ్రి పరివేదనను భరించలేక సీత చెయ్యి పట్టుకుని వెలుపలికి నడుస్తాడు )

దశరథుడు: సుమంత్రా! నా రాముడు వెళ్ళిపోతున్నాడు... చూస్తున్నావా... కైకా! నీ కళ్ళు ఇక చల్లగా ఉంటాయి కాబోలు ( సీతారాములు ఈ లోపలే నిష్క్రమించి ఉంటారు )

సుమంత్రా! నా బిడ్డను అడవులపాలు చేసి రావడానికి నువ్వుకూడా వెంట వెళ్ళరా!

ఎన్ని జన్మల కర్మఫలమో ఈ నాడు అనుభవిస్తున్నాను. దుష్టబుద్ధితో కైకేయి వరాల నెందుకు కోరాలి. ప్రతిఘటించకుండా వాటిని నే నెందుకు సమ్మతించాలి? నా బుద్ధి నా అధీనంలో లేదు కాబోలు. ఇదంతా దైవికం... కాకపోతే...నా ప్రాణం కన్నా మిన్నగా ప్రేమించే నా రాముడికి ఇంత శిక్ష విధిస్తానా?

సుమంత్రా! యౌవనంలో ఉన్నప్పుడు, ఒకసారి అడవికి వేటకు వెళ్ళాను. పొదల మధ్యలో ఉన్న ఒక మడుగులో బుడ బుడమని ధ్వని వినిపించి ఏదో క్రూరమృగమని భ్రమపడి శబ్దవేది విద్యతో బాణం ప్రయోగించాను. అజ్ఞానంతో నేను ప్రయోగించిన ఆ బాణం గుచ్చుకున్నది ఒక ముని బాలుడికి. ఆ బాలకుడి తల్లిదండ్రులు గ్రుడ్డివాళ్ళు. కుమారుడు తప్ప ఇంకో ఆధారమూ లేని ఆ ముసలి



దంపతులు పుత్రశోకాన్ని భరించలేక తామూ ఆహుతి అయ్యారు. ఆ పాప ఫలితమే ఇది. ఆ నాడు నేను వాళ్ళకు కలిగించిన పుత్రశోకాన్నే ఈ నాడు నేను అనుభవిస్తున్నాను. వాళ్ళ వేదనే శాపమై ఈ నాడు నన్ను తాకింది. ఎలాంటి వాడికైనా కర్మఫలం అనుభవించక తప్పదు.

సుమంత్రా! పద్నాలుగు సంవత్సరాల తరవాత అయోధ్యా సింహాసనం అధిష్ఠించే రాముణ్ణి చూడగలిగే భాగ్యమే భాగ్యం కదా! మృత్యువు నన్ను కబళించక ముందే నా రాముని దివ్యమంగళ రూపాన్ని ఈ పాపిష్ఠి కళ్ళతో నేను మళ్ళీ చూడగలనా?

రామా! చేతగాని నీ తండ్రిని క్షమిస్తావు కదూ! నీ పునర్దర్శనం లేకుండా ఈ దేహాన్ని విసర్జిస్తున్న నన్ను అపార్థం చేసుకోవు కదూ! అదిగో యమభటులు నా కోసం వాకిట ముందు నిలబడి ఉన్నారు. సుమంత్రా! రాముణ్ణి నా మీద కోపగించుకో వద్దని చెబుతావు కదూ! ఇక నాకు వ్యవధి లేదు రామా! వస్తున్నా! వస్తున్నా!

( గాలిలోకి చేతులు చాస్తూ 'రామా! రామా!' అని ప్రలాపిస్తూ నేల మీదికి కుప్పలా కూలిపోతాడు.)

( తెర మెల్లిగా కిందికి జారుతుంది )